క్లుప్తంగా

మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి సాయం


విద్యార్థి కుటుంబానికి సాయం అందిస్తున్న దృశ్యం

నరసాపురం: పట్టణంలోని సూర్యా కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న గణేష్ ముక్తేశ్వరరావు ఇటీవల నీటి ప్రమాదంలో మృతిచెందాడు. కళాశాల యాజమాన్యం, తోటి విద్యార్థులు రూ.70 వేలు నగదు సేకరించి శుక్రవారం ముక్తేశ్వరరావు కుటుంబానికి అందించారు. ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ చేతులు మీదుగా నగదు అందించారు. కళాశాల కరస్పాండెంట్ ఘంటశాల బ్రహ్మాజీ, సిబ్బంది పాల్గొన్నారు.

మానవత శాంతి ర్యాలీ


మానవత ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: మానవత సేవా సంస్థ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పట్టణంలో ప్రపంచ శాంతి ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం స్థానిక గాంధీబొమ్మల సెంటర్ వద్ద ఫైర్ స్టేషన్ వరకూ శాంతి ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ రజనీకుమార్ మాట్లాడుతూ మానవత సేవా సంస్థ పేద ప్రజలకు, విద్య వైద్య అవసరాల నిమిత్తం అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో పట్టణంలో ఉన్న వివిధ విద్యా సంస్థల విద్యార్థులు, మానవత మండల శాఖ బోర్డు చైర్మన్ డాక్టర్ వర్మ, ముత్యాల రామారావు, ముత్యాల శ్రీనివాసరావు, డాక్టర్ పీఎస్ ప్రతాప్‌రాజు, మద్దాల వాసు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణపై శ్రద్ధ చూపాలి


పెనుగొండ పంచాయతీ పార్కును పరిశీలిస్తున్న డీపీఓ రామ్‌నాథ్ రెడ్డి

పెనుగొండ: పారిశుద్ధ్య నిర్వహణపై పంచాయతీలు ప్రత్యేక శ్రద్ధ చూపాలని డీపీఓ రామ్‌నాథ్ రెడ్డి అన్నారు. శుక్రవారం పెనుగొండ పంచాయతీలో పంచాయతీ పార్కును పరిశీలించారు. అనంతరం పంచాయతీలో సిబ్బందితో పారిశుద్ధ్య నిర్వహణపై సమీక్షించారు. తాగునీటి సరఫరాలోనూ ఎటువంటి అంతరాయం, ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నక్కా శ్యామలాసోనీ శాస్త్రి, పెనుగొండ సొసైటీ చైర్మన్ నక్కా వేద వ్యాస శాస్త్రి, డిప్యూటీ ఎంపీడీఓ సూర్యప్రకాష్, కార్యదర్శి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

సర్వే సక్రమంగా నిర్వహించాలి


సర్వే పర్యవేక్షిస్తున్న సర్పంచ్ శ్యామలా సోనీ శాస్త్రి

పెనుగొండ: ఫేస్ టూ ఫేస్ సర్వే సక్రమంగా నిర్వహించాలని సర్పంచ్ నక్కా శ్యామలా సోనీ శాస్త్రి సూచించారు. శుక్రవారం చెరుకువాడలో నిర్వహిస్తున్న ఫేస్ టూ ఫేస్ సర్వేను పర్యవేక్షించారు. సర్వేలోని అన్ని అంశాలను నమోదు చేయాలన్నారు. ఆమె వెంట కార్యదర్శి శ్రీనివాస రెడ్డి, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

పెనుగొండ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తాపీ కార్మికుల నుంచి వసూలు చేసిన సెస్ నిధులతో ప్రమాద సమయంలో ఆదుకోవడానికి కార్మికుల సంక్షేమ బోర్డు తక్షణం ఏర్పాటు చేయాలని భవన నిర్మాణ కార్మికుల సంఘ సహాయ కార్యదర్శి నాగిశెట్టి గంగారామ్ డిమాండ్ చేశారు. ఇటీవల ప్రమాదానికి గురైన సంఘ సభ్యుడు జద్దు సత్తిబాబుకు రూ.3 వేలు ఆర్థిక సహాయం సంఘం ద్వారా అందించారు. ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమాన్ని మరచాయన్నారు. తక్షణం బోర్డు పునరుద్ధరించి ప్రమాదంలో గాయ పడిన కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు కంబాల ఆదినారాయణ, చలుమూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అమర జీవుల బాటలో పయనించాలి

పెనుగొండ: అమరుజీవుల ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ వారి బాటలో ముందుకు సాగాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు మంతెన సీతారామ్ అన్నారు. శుక్రవారం ఆచంట కచేరీ సెంటర్‌లో అమర జీవులు ప్రేరేప మృత్యుంజయుడు, తాళ్ళ బసవ మల్లయ్యలకు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి పి మోహనరావు, జిల్లా కార్యదర్శి జేఎన్వీ గోపాలన్, మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగోపాల్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్ పాల్గొన్నారు.

పూడిక తీశారు.. మట్టి వదిలేశారు

పాముల బెడదతో సమస్య జఠిలం

పెనుగొండ: ఇటీవల కాలంలో నిర్వహించిన పంట కాలువ పూడిక తీత పనులు నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారాయి. పెనుగొండ మండలంలో పలు పంటకాలువల పూడికతీత పనులు నిర్వహించారు. అయితే, ఆయా పంటకాలువల వద్ద పూడిక తీసిన మట్టిని కాలువ గట్లపైనా, వరి చేలగట్లపైనా, రహదారుల పైనా వేసి వదలి వేయడంతో రహదారులు ఇబ్బందికరంగా మారాయి. పెనుగొండలో ఎన్నో ఏళ్లుగా మురుగుతో నిండిపోయిన ఎల్లప్ప కాలువ పూడిక తీత పనులు నిర్వహించారు. కానీ తీసిన మట్టిని తరలించకుండా వదలివేయడంతో ఇటు రైతులు, అటు ప్రజలు నానా అవస్థలకు గురవుతున్నారు.


ఎల్లప్ప కాలువ పూడిక తీత మట్టితో పాడైన వరి చేల గట్లు

ప్లాస్టిక్ వ్యర్థాలతో ఇబ్బందులు

ఎల్లప్ప కాలువ పూర్తిగా ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోవడంతో తీసిన ప్లాస్టిక్ వ్యర్థాలను వరిచేల గట్లుపైన పాడేశారు. అదేవిధంగా మునమర్రు రహదారిలో మట్టిని వదలేశారు. దీంతో ఇటీవల కురిసిన వర్షాలతో మట్టి తిరిగి కాలువలోకి జారడంతో పాటు రహదారిపైకి చేరుకొంది. వాహనదారులు వర్షాలకు జారి పడిపోతూ గాయాలపాలవుతున్నా పట్టించుకొనే నాథుడేలేరు. వర్షాలకు మొలచిన తుప్పలు గుబురు పొదలను తలపిస్తున్నాయి. దీంతో తుప్పల్లోకి పాములు చేరి రాత్రి వేళల్లో రోడ్డుపైకి వస్తుండడంతో మునమర్రు రహదారిలో రాత్రివేళ ప్రయాణం చేయడానికి హడలిపోతున్నారు. ఇదే పరిస్థితి పెనుగొండ దేవ రహదారిలోనూ నెలకొంది. ఓల్డ్ ఛానల్ పూడిక తీత తీసిన మట్టిని ఇటీవల విస్తరించిన రహదారిపై పడేశారు. మట్టి దిబ్బలు ఏర్పడి, వాటిపై పొదలు విపరీతంగా ఎదిగిపోయాయి.

పంచాయతీలకు అదనపు భారం

పంటకాలువలు గ్రామాల మధ్యలో ప్రవహిస్తున్న ప్రాంతంలో మట్టిని తరలించడానికి పంచాయతీలకు అదనపు భారంగా మారింది. పెనుగొండ పంచాయతీ పరిధిలో ఓల్డ్ ఛానల్ ప్రసిద్ధి గాంచిన శ్రీనగరేశ్వర మహిషాసురమర్ధనీ వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయం ప్రాంతం నుంచి వెళ్లడంతో మట్టి దిబ్బలు దుర్భరంగా దర్శనం ఇస్తున్నాయి. దీంతో యాత్రీకులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విపరీతంగా పొదలు పెరిగిపోవడంతో పంచాయతీ ఆధ్వర్యంలో మట్టిని తరలించారు. దీని ఖర్చు పంచాయతీకి అదనపు భారంగా మారుతుందని పలువురు విమర్శించారు. నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో మట్టి దిబ్బలు సత్వరం తొలగించాలని పలువురు కోరుతున్నారు.


పెనుగొండ దేవ రహదారిలో సీసీ రోడ్డుపైనే పంట కాలువ మట్టి వేయడంతో పెరిగిన తుప్పలు


మునమర్రు రోడ్డులో పంటకాలువ మట్టి వల్ల మట్టి రోడ్డును తలపిస్తున్న దృశ్యం

108లో ప్రసవం


108లో ప్రసవం చేస్తున్న సిబ్బంది

నరసాపురం రూరల్: మొగల్తూరు మండలం ముత్యాలపల్లి మోడి గ్రామానికి చెందిన బొక్కా ఏడుకొండలు కుమార్తె దుర్గా భవాని 108 అంబులెన్సులో శుక్రవారం ప్రసవించింది. తల్లీబిడ్డా క్షేమంగా ఉన్నారు. తెల్లవారు జామున పురిటి నొప్పులు రావడంతో 108కు సమాచారమిచ్చారు. ఈ అంబులెన్సులో భవానిని నరసాపురం ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో పురిటినొప్పులు ఎక్కువై 108 అంబులెన్సులోనే ప్రసవించింది. మెడికల్ టెక్నీషియన్ సంజీవ్‌కుమార్ సేవలు అందించారు. ప్రస్తుతం దుర్గా భవాని నరసాపురం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతుంది.

ముగిసిన క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్

నరసాపురం రూరల్: ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో మండలంలోని సీతారామపురంలో ఉన్న స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన అమరావతి క్వాంటం వ్యాలి హ్యాక్‌థాన్–2025 ఆన్‌లైన్ అవగాహన సదస్సు శుక్రవారం ముగిసింది. గోవా బిట్స్ పిలాని ఆచార్యులు ఇంద్రాక్షిరాయ్ చౌదరి, అటల్ ఇంకుబేషన్ సెంటర్ సీఈఓ డాక్టర్ చంద్రమౌళి తదితరులు విద్యార్థులకు క్వాంటం కంప్యూటింగ్ పై అవగాహన కల్పించారు. ఈ పోటీలకు 30 బృందాలను ఎంపిక చేశారు. ఏఐ అండ్ ఎంఎల్ విభాగాధిపతి డాక్టర్. బొమ్మ రామకృష్ణ, కళాశాల చైర్మన్ కేవీ సత్యనారాయణ, కోశాధికారి కేవీ స్వామి, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.సురేష్ కుమార్ పాల్గొన్నారు.

టీబీ వ్యాధిగ్రస్తులకు పోషకాహారం అందజేత


పౌష్టికాహార కిట్లను అందిస్తున్న రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ ఆనందరాజు, నవ్యజీవన్

పాలకొల్లు సెంట్రల్: టీబీ మందులు వాడే వారు తప్పనిసరిగా అదనపు పోషకాహారం తీసుకోవాలని రోటరీ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ రామకృష్ణ ఆనందరాజు అన్నారు. శుక్రవారం మండలంలోని లంకలకోడేరు గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ ఎం.నవ్యజీవన్ ఆధ్వర్యంలో టీబీ ముక్త్ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆనందరాజు మాట్లాడుతూ అదనపు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల వ్యాధి నుంచి త్వరగా కోలుకునే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం డాక్టర్ నవ్యజీవన్ మాట్లాడుతూ లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో క్షయ వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించి వారికి టీబీ యూనిట్‌లో పరీక్షలు చేయిస్తామన్నారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి ఆరు నెలలకు మందులు ఉచితంగా అందజేస్తున్నామన్నారు. వాటితో పాటు నెలకు రూ. 1000 ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా 20 మందికి అదనపు పోషకాహారం కిట్లను అందజేశారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, కె.సత్తిబాబు, జి.ఉదయ్ చందర్, ఎస్కే అమలేశ్వరరావు, బి.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విశ్వమానవ వేదికలో కాపు వనిత క్లబ్ సేవలు


వృద్ధులకు దుస్తులను పంపిణీ చేస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక విశ్వమానవ వేదిక వృద్ధాశ్రమంలో పట్టణ యునైటెడ్ కాపు వనిత క్లబ్ సభ్యురాళ్లు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారం స్థానిక విశ్వ మానవ వేదిక ఆశ్రమంలో వృద్ధులకు పంచెలు, రుమాళ్లు, స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షురాలు కావలి మౌని మాట్లాడుతూ వివిధ సేవా సంస్థల ద్వారా అందించే సేవలకన్నా వృద్ధాశ్రమాల్లో వృద్ధులను కంటికి రెప్పలా చూసుకుంటూ ఆ నిర్వాహకులు చేసే సేవలు అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యురాళ్లు కటికి అర్చన, తోట గాయత్రి, యామన విజయలక్ష్మీ, దేవరపు రామలక్ష్మి, గంధం మణి, త్సవటపల్లి నాగమణి తదితరులు పాల్గొన్నారు.


విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



ర్యాలీలో పాల్గొన్న ఎస్ఎఫ్ఐ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: మండలంలోని దగ్గులూరు గ్రామంలో నిర్మాణం మధ్యలో ఆపేసిన మెడికల్ కళాశాల పనులను వెంటనే ప్రారంభించాలని జిల్లా సహాయ కార్యదర్శి జి.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల అయిన గురుకుల పాఠశాలకు శాశ్వత భవనం నిర్మించాలన్నారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్ రూ.6600 కోట్లు బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. సంక్షేమ హాస్టల్స్ కోసం శాశ్వత భవనాలు నిర్మాణం చేయాలన్నారు. జీఓ 77 ను రద్దు చేసి పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను కల్పించాలన్నారు. అంతేకాకుండా అర్హులైన ప్రతీ విద్యార్థికి రూ.15 వేలు తల్లికి వందనం అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు నాగేంద్ర, గణేష్, భాను, నవీన్, శేఖర్, సత్యసాయి స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై పృథ్వీ

పాలకొల్లు సెంట్రల్: నేటి సమాజంలో పెరిగిన శాస్త్ర సాంకేతిక రంగాలను సద్వినియోగం చేసుకుని సమాజాభివృద్ధికి పాటుపడాల్సిన వారు నేరగాళ్లగా మారి దుర్వినియోగం చేస్తు సమాజాన్ని భ్రష్టుపట్టిస్తున్నారని పట్టణ ఎస్సై జి.పృథ్వీ అన్నారు. శుక్రవారం స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైబర్ నేరాలు జాగ్రత్తలు అనే అంశంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఎస్సై పృథ్వీ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం పెరగడంతో సైబర్ నేరాలు కూడా పెరిగాయన్నారు. దీనికి కారణం మనిషి జీవన విధానమే కారణమన్నారు. సోషల్ మీడియాలో పెడుతున్న రకరకాల పోస్టులతో సైబర్ నేరగాళ్ల అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మన వద్ద ఉన్న సంపదను దోచుకుంటున్నారన్నారు. కొన్ని సందర్భాలలో బ్లాక్‌మెయిల్‌కు సిద్ధపడుతున్నారన్నారు. వీటిని అరికట్టాలంటే సోషల్ మీడియా గురించి పూర్తి అవగాహన ఉండాలన్నారు. ఏది కనిపిస్తే దానిని క్లిక్ చేయకుండా జాగ్రత్తలుతీసుకుని దానిపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి, ఏఎస్సై మార్‌లింగం, వైస్ ప్రిన్సిపాల్ టి.కృష్ణ, కె.భద్రాచలం, డాక్టర్ వి.యామిని తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులపై విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న ఇన్‌స్టిట్యూషనల్ కేర్ ప్రొటెక్షన్ ఆఫీసర్ పి.మమతాశ్రీ

యలమంచిలి: జిల్లా బాలల సంరక్షణ యూనిట్ (మిషన్ వాత్సల్య) ఆధ్వర్యంలో శుక్రవారం దొడ్డిపట్ల హైస్కూల్లో బాలల హక్కులు, చట్టాలు, సంక్షేమ పథకాలు, బాల్య వివాహాలు వలన కలిగే నష్టాలు, పోక్సో యాక్ట్ – 2012 పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారిత అధికారి ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఇన్‌స్టిట్యూషనల్ కేర్ ప్రొటెక్షన్ ఆఫీసర్ పి.మమతాశ్రీ విద్యార్థులకు మంచి నడవడిక, నైతిక విలువలను పెంపొందించుకునే విధానాన్ని గురించి నీతి కథలు ద్వారా వివరించారు. విద్యార్థులు చదువుపై శ్రద్ధ కలిగి ఉండాలని, బాగా చదివి ఉన్నత స్థానాలకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రామేశ్వరపు సత్యనారాయణ, పాలకొల్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్ఎన్ మల్లీశ్వరి, డీసీపీయూ వర్కర్ స్వర్ణలత, వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్ ఎస్.రేణుక పాల్గొన్నారు.

పెరుగుతున్న గోదావరి వరద ఉధృతి


నరసాపురం: వలంధర్‌రేవు వద్ద భారీగా పెరిగిన గోదావరి ఉధృతి


యలమంచిలి: కనకాయలంకలో వరదలో మునిగిన కాజ్‌వేను పడవలపై దాటుతున్న గ్రామస్తులు

నరసాపురం: నరసాపురంలో వశిష్ఠ గోదావరి ఉధృతి భారీగా పెరుగుతుంది. గత రెండురోజులుగా ఎగువప్రాంతం నుంచి భారీగా నీరు వచ్చి చేరుతుండటంతో నీటిమట్టం పెరుగుతూ భయపెడుతోంది. శుక్రవారం వలంధర్‌రేవులో అడుగున్నర నీటిమట్టం పెరిగింది. వలంధర్‌రేవులో పిండ ప్రధానం షెడ్డు ప్లాట్‌ఫామ్ పైకి నీరు చేరింది. దీంతో రేవులో స్నానాలు చేయకుండా నిషేధించారు. లలితాంబ ఘాట్ పూర్తిగా నీట మునిగింది. పడవల రేవు వద్ద ప్రవాహ ఉధృతి విపరీతంగా పెరిగింది. రేవులో పంటు రాకపోకలు కొనసాగించే వీలు లేకుండాపోయింది. దీంతో వరుసగా రెండో రోజు పంటు రాకపోకలు నిలిచిపోయాయి. మరో నాలుగురోజుల పాటు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.


నరసాపురం: గోదావరిలో పంటు రాకపోకలు నిలిపేసి ఉంచిన దృశ్యం


పెనుగొండ: ఆచంట మండలం మసేనమ్మ కట్టలోకి ప్రవేశించిన వరద నీరు


యలమంచిలిలో..

యలమంచిలి: గోదావరి ఎగువ భాగంలో వరద నీరు తగ్గుతూ కిందకు దిగడంతో దిగువ భాగంలో వరద శుక్రవారం రెండడుగుల మేర పెరిగింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పెరిగిన వరద మధ్యాహ్నం నుంచి నిలకడగా ఉండిపోయింది. దీంతో కనకాయలంక కాజ్‌వే పైన వరుసగా నాలుగో రోజు సుమారు నాలుగడుగుల నీరు నిలబడింది. దీంతో ప్రజలు ఇంజన్ పడవలపై రాకపోకలు సాగించారు. తహసీల్దార్ గ్రంధి నాగ వెంకట పవన్‌కుమార్ శుక్రవారం కనకాయలంలో పర్యటించారు. అక్కడ శిబిరంలో అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గోదావరి ఎగువ భాగంలో నీరు క్రమేపీ తగ్గుతుందన్నారు. ఈ ప్రభావం వలన మరో 48 గంటల వరకు ఉంటుందన్నారు. దీని వలన శనివారం, ఆదివారం కూడా కనకాయలంక కాజ్‌వే వరద నీటిలోనే ఉంటుందన్నారు. సోమవారం ఉదయానికి కాజ్‌వే బయటపడే అవకాశం ఉందన్నారు. కాజ్‌వే బయటపడే వరకు ప్రజల రాకపోకలకు ఇబ్బంది లేకుండా ఇంజన్ పడవలు నడుపుతామన్నారు. ఆయన వెంట వీఆర్వోలు కడిమి ఘనలక్ష్మీ, సరెళ్ల లక్ష్మీ, కాకితాపల్లి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

పెనుగొండలో..

పెనుగొండ: గోదావరి ఉధృతి క్రమేపి పెరుగుతుంది. ఎగువ నుంచి వరదనీరు భారీగా గోదావరిలోకి చేరుతుండడంతో ఉధృతంగా ప్రవహిస్తుంది. పెనుగొండ మండలం దొంగరావిపాలెం, సిద్ధాంతం, నడిపూడి, చినమల్లం, ఆచంట మండలం పెదమల్లం, కోడేరు, భీమలాపురంల్లోవరద నీరు ఏటిగట్టును తాకుతూ ప్రవహిస్తుంది. లంక గ్రామాల్లో మరో నాలుగు అడుగులు పెరిగితే నివాసాల వద్దకు వరద నీరు చేరుకొంటుంది. ప్రస్తుతానికి కూరగాయల తోటలు, తమలపాకు తోటల్లోకి వరద నీరు చేరుకుంది. పెదమల్లం లంక, అయోధ్యలంక, పల్లే పాలెం, రావి లంక, పుచ్చల్లంకల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. పడవల్లో లంక గ్రామాల ప్రజలు రాకపోకలు ప్రస్తుతానికి యథావిధిగా కొనసాగిస్తున్నారు. అయితే పడవ ప్రయాణాలపై అధికారులు నియంత్రణ విధించారు. దీంతో లంకల్లో పంటను గట్టు తెచ్చుకోవడానికి రైతులు నానావస్థలు పడుతున్నారు. పాడి పశువులను గట్టుకు తెచ్చుకోలేక వరద నీటిలోనే వదలి ఉంచారు. మరింత ఉధృతి పెరిగితే ఎటిగట్టుకు తెచ్చుకోవాల్సి ఉంటుందని పాడి రైతులు తెలిపారు. అయితే పశుగ్రాస కొరత ఏర్పడే అవకాశం ఉందని వాపోతున్నారు.

వైభవంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు


యలమంచిలి: ప్రత్యేకాలంకరణలో పుంతల ముసలమ్మ


యలమంచిలి: అడవిపాలెంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు చేస్తున్న మహిళలు


పెనుగొండ: వడలిలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు చేస్తున్న దృశ్యం

యలమంచిలి: శ్రావణ మాసం ఆఖరి శుక్రవారం సందర్భంగా గ్రామాలలో మహిళలు వరలక్ష్మీ వ్రతాలను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. అడవిపాలెం గ్రామ దేవత కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం విశేష పూజలు చేశారు. ఆలయ అర్చకులు సుదర్శనం శ్రీనివాసాచార్యులు బ్రహ్మత్వంలో అమ్మవారికి సామూహిక కుంకుమార్చనలు, పంచామృతాభిషేకం చేశారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు బొలిశెట్టి రావులియ్య, పితాని శ్రీనివాస్‌లు ఏర్పాట్లను పర్యవేక్షించి, భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. స్థానిక కాపులపాలెంలోని గ్రామ దేవత పుంతల ముసలమ్మ అమ్మవారిని శ్రావణ శుక్రవారం సందర్భంగా భక్తులు అత్యంత సుందరంగా అలంకరించారు. పసుపుతో అమ్మవారి పాదముద్రలు తయారు చేసి కుంకుమ బొట్లు పెట్టారు. మధ్యాహ్నం ఆలయం వద్ద మహిళలంతా కలిసి సామూహిక లలిత సహస్ర నామ పారాయణ చేశారు. మేడపాడు శివాలయంలో అర్చకులు బాదంపూడి సత్యనారాయణ మూర్తి, చిరంజీవి శర్మ బ్రహ్మత్వంలో పార్వతీదేవి వద్ద సామూహిక కుంకుమార్చన చేశారు.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ మాసం ఆకరు శుక్రవారం కావడంతో సామూహిక వరలక్ష్మీవ్రతాలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం ఆలయ అభిషేక పండిట్ భమిడపాటి వెంకన్న బ్రహ్మత్వంలో జరిగిన ఈ పూజా కార్యక్రమాల్లో సుమారు 1500 మంది మహిళలు పాల్గొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనడంతో ఆలయ ప్రాకార మండపాలతో పాటు అభిషేక మండపంలోనూ కూర్చోబెట్టారు. పూజలో పాల్గొన్న భక్తులకు పూజా సామాగ్రి, లక్ష్మీదేవి ప్రతిమలు అందజేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ముచ్చర్ల శ్రీనివాసు, ఆలయ సూపరింటెండెంట్ వాసు, అర్చకులు మద్దూరి సూరిబాబు, కిష్టప్ప, అనిల్, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.


పాలకొల్లు సెంట్రల్: క్షీరారామంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాల్లో పాల్గొన్న మహిళలు

పెనుగొండలో..

పెనుగొండ: శ్రావణ శుక్రవారం సందర్భంగా వడలి గ్రామ దేవత మందాలమ్మ ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు దుగ్గిరాల నాగేశ్వర శర్మ సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలతో చేయించారు. పరిసర ప్రాంతాలకు చెందిన మహిళలు అధిక సంఖ్యలో వ్రతంలో పాల్గొన్నారు.